# శుభాకాంక్షలు

-డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి

ఆ రోజు మార్చి ఎనిమిది.

మహిళలకు ప్రత్యేకంగా ఇవ్వబడిన మహిళా దినం కానీ రఘానీ బాధల్లో ఉంది. ఆమెను ఓదార్చడానికి నేను ఝానీ ఇంటికి వెళ్ళాను ఆమె నాకు సెకండ్ కజిన్. అదే టైమ్‌కి సౌమ్య కూడా వచ్చి ఝానీ పక్కన కూర్చుంది.

నన్ను చూసి ఝానీ కళ్ళు తుడుచుకుంది నేను మెల్లగా వెళ్ళి వాళ్ళ ప్రక్కకి మోడాని జరుపుకుని కూర్చున్నాను.

సౌమ్య నా వైపు తిరిగి మరిచిపోని సంప్రదాయ పద్ధతిలో పలకరింపుగా ఓ చిరునవ్వు నవ్వి ఝానీతో సంభాషణను కొనసాగించింది.

"ఝానీ! నిన్ను ఇంకా ఆదిశక్తిగా గుర్తించకుండా తన గుప్పెట్లో పెట్టుకోవాలని అనుకునే మీ ఆయన్ని వదిలెయ్.... రోజులు మారాయి. నీకేం?... డబ్బుంది నువ్వు మరో పెళ్ళి చేసుకోవచ్చు... నా మాట విను ఎన్ని రోజులని స్వేచ్ఛలేకుండా బతుకుతావు?".

ఉలిక్కిపడ్డాను నేను.

సౌమ్యా! మా ఆయన నిరంకుశుడే... కానీ నన్ను చాలా ప్రేమిస్తాడే... ఝానీ కంఠంలో దయనీయత... భర్తను వదలలేని నిస్సహాయత... అతని ఆధిపత్యాన్ని ఓర్చుకోలేని వ్యతిరేకత.

నా మనసు ఝానీ సమస్య పట్ల స్పందించింది.

నేను ఆమెను ఓదార్చబోయాను.

సౌమ్యలో ఆవేశం ఇంకా తగ్గినట్లు లేదు తనే మరలా అంది.

"చూడు ఝానీ! ఈ మగవాడు తెలివిగలవాడు మనకు సంకెళ్ళు వేసి, ప్రేమ అనే తాళం చెవిని మనచేతికే ఇచ్చి.... ఆ తాళం తీసి స్వేచ్ఛగా ఎగిరిపోలేని మన బలహీనతను చూసి గర్వపడ్తుంటాడు. అలాంటి ఛాన్స్ మనం వాళ్ళకివ్వకూడదు. మనలాటి వాళ్ళు ఇలాటి వాళ్ళను బహిష్కరిస్తే సమాజం బాగుపడుతుంది.

నా మనసు మూలిగింది.

సౌమ్య చెప్పే మాటలు నాకు నచ్చాయో నచ్చలేదో పూర్తిగా అర్థం కాని అయోమయంలో పడింది అది.

కానీ

ఎందుకో నా మనసులో ఏదో అసంపూర్ణత పూర్తిగా సమర్థించలేని భావం....

ఎందుకు? ఎందుకని?...

స్త్రీని సపోర్ట్ చేస్తూ మార్చబడిన చట్టాల్ని 'భేష్' అని మెచ్చుకున్న నా మనసుకు ఈ రోజు ఏమైంది?

భర్త పట్ల అత్త వల్ల అన్యాయం కాబడుతున్న స్త్రీని ఒళ్ళోకి తీసుకోవడానికి వచ్చిన 'మహిళా దినాన్ని' సంతోషంగా ఆహ్వానించిన నా మనోభావాలకు ఏ రోగం వచ్చింది?

'నా వాడు... నా వాళ్ళు... వాళ్ళు మారుతారు' అని ఎదురుచూసి, వాళ్ళ అకృత్యాల్ని సహించినంతకాలం సహించి అవి మితిమీరిన క్షణాన తిరుగుబాటు చేస్తున్న మహిళను అభినందించే ఈ మనసుకు ఈ వేళ ఏమైందో?

సౌమ్య కోరినట్టు రఘానీ తన భర్తను వదిలేయడాన్ని నా మనస్సు సమర్థించడం లేదు.

అయినా... మహిళా సంవత్సరం మీద ఒట్టు.

నేను పోరాటానికి విరుద్ధురాల్ని కాదు.

నా మనసు పొరల్లో చీకటి అలుముకుంది.

నేను మానసికంగా నా నేస్తాల నుండి డిటాచ్ అయ్యాను. నా లోకంలోకి నేను వెళ్ళిపోయాను.

నా ఆలోచనల్ని విదిలించాను. మెదడులోకి దూరాను.

దానికి పదును పెట్టాను... ఏదో దొరికినట్టయింది.

'సమస్యకు పరిష్కారం పోరాటమే కానీ పారిపోవడం కాదు'

'సమస్యకు పరిష్కారం సాధించడమే కానీ, వదిలించుకోవడం కాకూడదు'.

'సమస్యకు మూలకారణాన్ని వెతికి, వేరును తినేసే ఆ పురుగును ఏరి పారేయాలిగానీ వేరునే పెరికేయకూడదు....'

ఎందుకంటే ఆ వేరు చాటు మానవబంధాలు వున్నాయి.

సంసారాలున్నాయి.

భార్యాభర్తల్ని అల్లుకుని పిల్లలున్నారు.

హఠాత్తుగా నా ఆలోచనలు ఆగి వెనక్కు తిరిగాయి.

అంటే, అంటే సమస్యా పరిష్కారానికి... 'తలవంచడం' అనే మార్గాన్ని ప్రోత్సహిస్తోందా తను?!.

ఊహుకాదు

మరేవిటి?

నా పోరాటం... దాని లక్ష్యం....

స్త్రీని సమస్యలకు తలవంచమనడం కాదు

అలా అని

స్త్రీని సమస్యల నుండి పారిపొమ్మనడమూ కాదు.

యుద్ధ భూమిలో ఆయుధాలు చాలా వుంటాయి.

ఏ ఆయుధంతో అయినా పోరాడచ్చు.

కావాల్సింది గెలుపు అంతే...

ఆ గెలుపులో శత్రువు చనిపోయినా పర్వాలేదు.

ఇక్కడా అంతే... ఆయుధాలు చాలానే... కానీ పోరాటంలో చిన్న తేడా.

ఈనాటి ఆడదాని ఆవేశం వెనుక ఆయుధాలు చాలా నిశ్శబ్దంగా పడున్నాయి.

ధైర్యం...

ఓర్పు....

ఆలోచన...

ముందుచూపు...

ప్రేమ, పట్టుదల, పోరాటం....

ఆఖరి అస్త్రంగా తెగింపు

కానీ... ఇక్కడ...

ఆయుధం ఏదైనా,

గెలుపు ఆమెదయినా,

అతను చావకూడదు.

అతన్ని గెల్చుకోవాలి

నా పోరాటం కేవలం గెలుపుకోసమే కాదు

ఆ గెలుపులో బతుకు నిబిడీకృతమై వుండాలి

ఆ బతుకులో సంతోషం వెల్లువై పోవాలి

లేకపోతే

పోరాటానికి అర్థం లేదు.

ఇది నిజం

మగవాడు గుండెల్లో ఇంతగొప్ప ఆయుధాలు లేవు

అతని మనుగడలో.

శాడిజమ్ వుంది. బెదిరింపు వుంది.

ఇగో వుంది

నిరంకుశత్వముంది

ఎన్నో యుగాలుగా అతను వాటిని ఉపయోగిస్తూనే వున్నాడు.

ఇవేవీ స్త్రీని గెల్చుకోలేవు.

స్త్రీ అతనికి భయపడింది. చెడు అలవాట్లకు బానిస అవుతాడన్న భయంతో వణికింది.

నేరం అతను చేస్తే శిక్ష కుటుంబం భరించాలి.

అందుకే... అతనికి ఓడినట్లు నటించింది.

ఆనాడు... బతుకు ఓ నటన, ఓ బూటకం

మనకు నటన వద్దు

నిజం కావాలి

ఆ నిజం కోసం పోరాటం చేయాలి

ఆ పోరాటం వల్ల బ్రతుకు పండాలి

## మోదుగ పూలు

అణగారిన బీడు భూముల్లో మణిదీపాలై వెలిగే
అమోఘమైన మాఘమాసపు గోగుపూలు;
ఉన్న మూడాకులను వెన్నులో దాచుకొని
మన్నులోంచి మొలిచిన మన్మధ పూబాణాలు;
కరువు తరిమితే పరుగెత్తుకెళ్ళే బడుగు
జీవులను
ఎరుపు బావుటాలై నిలువరించే కాషాయపు
కాగడాలు;
చందనపు లేపనాలను బినామీ నేలలకు తేరగా
పంచే
కుందనపు ఎరుపు బొమ్మల కొలువులు ఈ
అగ్నిపూలు;
సహజ గంభీర తేజస్సును ఒంటి నిండా
పులుముకొని
నిలువెత్తు దివిటీల్లా ఎగిసిన నిటలాక్షుని
త్రిశూలాలు;
గులాబీల సొగసులకు ఏమాత్రం తీసిపోకుండా
కొండకోనల్లో నీటి ఎద్దడిలో దండిగా పూసిన
కాశ్మీరాలు;
ప్రకృతి మనిషికి దయతో ఒసగిన సౌందర్యపు
సోయగాలు;
ఆస్వాదించే మనసులకు హమేషా ఆనందాన్ని
పంచే అంగారికలు;
పల్లెసీమల్లో నేటికీ మేమున్నామని తలెత్తుకు
నిలిచి
సహజంగా విరగబూసిన జనపదాలు ఈ
మోదుగ పూలు.

—దేవి యాదగిరి

'అబద్దాల బతుకే నాకు ఇష్టం ఆధిపత్య సింహాసనమే నాకు కావాలి' అంటాడా?..

అలా అని
మనవాడు ఇంకా శిలగానే వుంటానంటే...
అదివాడి ఖర్మ...
స్త్రీ జీవితాన్ని భస్మం చేస్తానంటే మాత్రం
అప్పుడు ఆడది ఆదిశక్తి కావాలి.
తన మౌనాన్ని ఛేదించి
తన జీవితాన్ని తనే నిర్మించుకోవాలి

ఉలిక్కిపడ్డాను. నేను సౌమ్య నన్ను తట్టి పిలుస్తోంది..

"ఏమిటి అలా బ్లాంక్‌గా అయిపోయావు?" అడిగింది సౌమ్య.

"ఏవీ లేదు... ఏవీ లేదు.." తడబడ్డాను.

"సౌమ్యా! ఆయన క్రూరుడేం కాదే కాకపోతే నా మీద సవారీ చేయాలని చూస్తాడు అంతే!!" బేలగా చూసింది ఝాన్సీ.

నోరు తెరవాలనుకున్నాను.

అక్కడికక్కడే ఆ సమస్యను పరిష్కరించాలనుకోవడం. తెలివి గల పని కాదు. అందుకే మరలా మౌనంలోకి వెళ్ళిపోయాను.

"ఆ సవారినీ కొద్దు నీ జీవితాన్ని నువ్వు నిర్మించుకో"

నేను అనుకున్నదే... సౌమ్య అంది.

ఝాన్సీ కంట్లో నుండి కన్నీటి బొట్టు రాలి పడింది.

ఆ కన్నీటి బొట్టు నాకు చాలా చెప్పింది.

ఇప్పుడు నాకు నోరు తెరవాల్సిన సమయం వచ్చింది.

"ఝాన్సీ!" పిలిచాను.

"నీకు కావాల్సిందేమిటి? అతను మారడమా? నీ జీవితం మరోలా మారడమా?"

"ఆయన లేందే నేను బతకలేను... మరో కన్నీటి బొట్టు. ఈసారి అది గొంతులో నుండి రాలింది.

"నీలాటి వాళ్ళ వల్లే ఈ మగాళ్ళు విర్రవీగేది... నీ ఖర్మ... ఇంక నిన్నెవ్వరూ బాగుచెయ్యలేరు"

సౌమ్య విసుక్కుంది... హతాసురాలైంది.

ఈసారి నా ప్రశ్న సౌమ్య వైపుకి గురి పెట్టబడింది

"సౌమ్యా! నీకేం కావాలి? ఝాన్సీ బతుకు బాగుండడమా? ఝాన్సీకి కొత్త బతుకు రావడమా?"

సౌమ్య ఆలోచనలో పడింది.

"ఝాన్సీ! నీకు నీ భర్త కావాలి. కానీ అతని ఆధిపత్యం అతని అమానుషత్వం నీకొద్దు అవునా?"

'అవును' అన్నట్టు తలూపింది ఝాన్సీ.

అయితే నీ మీనసును కాస్త గట్టి పరచుకో నీ దగ్గర పదిలంగా మౌనంగా వున్న సామదాన భేద, దండోపాయాలతో అతన్ని గెలుచుకో. నీతో సహకరించడానికి చాలామంది మహిళలు నీ వెనక వున్నారు. చట్టం నీకు సహకరిస్తోంది. సమాజం నీకు భయపడ్తోంది. ఇదంతా నీ యుద్ధ భూమి... ఇప్పుడు నీ ఆయుధాల్ని వాడుకోవాల్సిన అవసరం వచ్చింది.

నాకు తెలుసు... నీ వాణ్ణేకాదు నువ్వు జీవితాన్నే గెల్చుకోగలవు. ఆల్ ది బెస్ట్.. నీకు నా మహిళా దిన శుభాకాంక్షలు.

## నానీలు

**మ**ధ్యాహ్న భోజనంలో
చికెన్ తప్పదు
సాయంత్రం
బ్లూ క్రాస్ మీటింగ్

**శి**వుడిని కూడా
కుట్టిన చీమ
ఇప్పటి ఆజ్ఞ
మత పెద్దలది

**దీ**పం కింది నీడలు
కొద్దిసేపే
జీవితాన్ని కమ్మిన నీడలు
కడదాక

**న**దుల
అనుసంధానం కంటే
పార్టీల
అనుసంధానమే ముఖ్యం

**స్త్రీ**లు తొందరగా
వృద్ధులవుతున్నారెందుకు?
లేడీస్
ఫస్ట్ కదా!

-వై. క్రిష్ణకుమార్